క్లుప్తంగా

ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్ పురస్కారం ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్ : టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి గుంటుపల్లి వేంకట దినేష్ ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్ పురస్కారాన్ని పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్‌కే శాస్త్రి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 25 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ గుంటూరు గ్రూపు పరిధిలోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన కేడెట్లకు నిర్వహించిన రాత పరీక్ష, కవాతు, ఫైరింగ్, మౌఖిక పరీక్షలో ప్రథమస్థానంలో నిలిచిన తమ విద్యార్థి దినేష్‌కు గ్రూపు కమాండర్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్ పురస్కారంతో పాటు రూ.4,500 నగదు అందజేశారని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల పాలకమండలి అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, కార్యదర్శి కేవీ బ్రహ్మం, పీజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. అనితా దేవి, ఎన్‌సీసీ అధికారి మేజ్ పి. కుమార్‌రాజా, అధ్యాపకులు దినేష్‌ను అభినందించారు.

పేరుకుపోయిన వ్యర్థాలతో అవస్థలు



గుంటూరు ఎడ్యుకేషన్ : దేవాపురం 4వ లైనులో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని ఇటీవల చెట్ల కొమ్మలు నరికివేసిన విద్యుత్‌శాఖ సిబ్బంది వాటిని అక్కడే రోడ్డు పక్కన పడవేశారు. జనావాసాల మధ్య చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండే ఆ ప్రాంతం ప్రస్తుతం వ్యర్థాలకు ఆవాసంగా మారింది. చెట్ల కొమ్మలను వేసిన చోట స్థానికులు కూడా చెత్తను తెచ్చి పారబోస్తున్నారు. స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థినికి డీఈవో అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్ : ఇస్రో యువికా యువ శాస్త్రవేత్త కార్యక్రమానికి ఎంపికైన గుంటూరు రూరల్ మండలం రెడ్డిపాలెంలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థిని కాలారి లావణ్యను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అభినందించారు. గురువారం డీఈవో కార్యాలయంలో లావణ్యను అభినందించాక రేణుక మాట్లాడుతూ.. కార్యక్రమానికి గుంటూరు జిల్లా నుంచి ముట్లూరు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి సందు పవన్‌దుర్గ, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి వక్కపట్ల సోమశేఖర్‌తోపాటు లావణ్య ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ ముగ్గురు మే 18 నుంచి 31వ తేదీ వరకు శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రంలో జరగనున్న యువికా యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాంలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, విద్యార్థిని తల్లి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలకు మూఢ నమ్మకాలు బోధించవద్దు



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు సాకేత రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా గుంటూరు జిల్లా రచయితల సంఘం, శ్రీసీతారామంజనేయ భక్త సమితి సంయుక్తంగా గురువారం కవి సమ్మేళనం నిర్వహించాయి. శ్రీరాముని లక్షణాలు, రామాయణ ఘట్టాలను కవులు ఉదహరించి, ఉగాది ప్రాశస్త్యాన్ని తెలియజేసేలా కవితలు చదివారు. కవి సమ్మేళనం సమన్వయకర్త డాక్టర్ లలితకుమారి రామాయణం విశిష్టతను వివరించారు. అనంతరం కవులను ఆలయ కమిటీ నిర్వాహకులు కాకి శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి దంపతులు సత్కరించి, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, పలువురు కవులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో రూ.20 లక్షలు మోసం

లక్ష్మీపురం: చీటీల పేరుతో స్థానికంగా ఉండే వారి నుంచి రూ.20 లక్షలు వరకు వసూలు చేసి మోసం చేసిన మహిళ పై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాకేతపురానికి చెందిన చిలకపాటి మస్తానమ్మ అనే మహిళ స్థానికుల వద్ద చీటీల పేరుతో రూ.20 లక్షల వరకు వసూలు చేశారు. తిరిగి ఇవ్వకుండా కొన్నాళ్లుగా తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేస్తున్నారు. దీనిపై అన్నెం సీత, మరి కొందరు కలిసి అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించారు. వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాహితీవనంలో నిప్పుకణిక కొమ్మిరెడ్డి

- ఎన్‌కౌంటర్‌లో బలై పాతికేళ్లు
- నేడు గుంటూరులో 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సందర్భంగా...

తెనాలి: కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి... ప్రజాఉద్యమనేత, గ్రామికవర్గ నవలా రచయిత. తన జీవితాన్ని, రచనా వ్యాసంగాన్నీ పీడితవర్గాల విముక్తి కోసం వినియోగించి, పాలకవర్గాలకు కంటగింపుగా తయారైన ఉద్యమకారుడు. ఆ వర్గం సృష్టించిన 'మానవహోమం'లో సమిధగా మారాడు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో ఆయన కన్నుమూసి పాతికేళ్లు. ప్రజాసంఘాల నిరసనను, ప్రజాస్వామిక హక్కులను 'అధికారం' నిరంకుశంగా అడ్డుకుంటున్న సందర్భంలో విశ్వమోహన రెడ్డి స్ఫురణకు వస్తారు. జనసాహితి ఆధ్వర్యంలో 11న సాయంత్రం గుంటూరులోని సీనియర్ సిటిజన్స్ సేవాకేంద్రంలో 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ సభ జరగనుంది.

కడప జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని పొట్టిపాడు విశ్వమోహనరెడ్డి స్వస్థలం. సంపన్న రైతు కుటుంబంలో 1949లో జన్మించారు. జడలు విప్పి కరాళ నృత్యం చేసిన ఫ్యాక్షన్ మారణహోమంలో ఆప్తుల్నీ, ఆస్తుల్నీ కోల్పోయాడు. పొట్టకూటి కోసం ఏడొక పనిచేయాల్సిన అగత్యం ఎదురైంది. జీవనం కోసం ఆయన చేయని పనిలేదంటే అతిశయోక్తి కాదు. రైతు ఇంట పాలేరుగా, రైతుకూలీగా, రిక్షా కార్మికుడిగా, ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడిగా రకరకాల పనులు. ఆ క్రమంలోనే ఆ జీవితాల్లోని పీడననూ, దోపిడీని అవగతం చేసుకున్నాడు. తన బతుకు తాను బతుకుదాం అని సరిపెట్టుకోలేదు. తోటివారి జీవితాల్లో వెలుగులు నింపుదామని ఆలోచన చేశాడు. సంఘటిత శక్తిగానే అది సాధ్యమని నమ్మాడు. అందు కోసం కంకణం కట్టుకున్నాడు. నిద్రలేచింది మొదలు బండచాకిరీ మినహా మరేం తెలీని పాలేర్లకు సంఘం వచ్చింది. రిక్షా యూనియన్ ఆవిర్భవించింది. కార్మిక సంఘాలు ఏర్పాటయ్యాయి. అందుకు కారకుడు విశ్వమోహనరెడ్డి, తాను క్రియాశీలంగా ఉంటూ శ్రామికవర్గాల్లో చైతన్యం నింపాడు. దోపిడీకి వ్యతిరేకంగా హక్కుల కోసం గళం విప్పేలా చేసి, పోరుబాటన నడిపించాడు.



పిడుగురాళ్లలోని లెనిన్‌నగర్



విశ్వమోహనరెడ్డి భవన్



కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి

ప్రమాణ పత్రం రాసుకుని...

'పాఠకులను సోమరిపోతులను చేసే కవిత్వాలకంటే ఆచరణలో ఒక పాఠకున్నయినా నిలపడానికి వచ్చే యథార్థాలే రాయడం నా ఉద్దేశం. చివరివరకు ఇదే పద్ధతి అనుసరిస్తానని, ఎట్టి వాస్తవరహిత, అభూతకల్పనలు నేను రాయబోననీ, నా పాఠకులకు నేను తెల్పుకుంటున్నాను' అని ప్రమాణపత్రం రాసుకున్నారు. ఆ మాటకు అటూ ఇటూ బెసగకుండా వాస్తవిక సంఘటనలు ఆధారం చేసుకుని ఆయన చేసిన రచనలు సంచలనాన్నే సృష్టించాయి. 'జైలు' నవల టాల్‌స్టాయ్ నవల 'నవజీవనం' అంతటి ఉత్తమమైన నవలగా గుర్తింపును పొందింది. 'జైలు'తోపాటు మరో నవలలను శారద సాహిత్యవేదిక, తెనాలి వారు ప్రచురించారు. విశ్వమోహనరెడ్డిని జాక్‌లండన్, గోర్కీ , కుప్రిన్ వంటి రచయితలతో పోల్చినవారున్నారు. అచ్చులో వచ్చిన ఆయన తొలి నవల 'మానవహోమం'ను 'భోగిమంటలు' సినిమాగా తీశారు. సినీ అవకాశాలు వచ్చినా, జనం ముఖ్యమనుకుని ఆయన ఆ రంగంకేసి చూడలేదు. ప్రకాశం జిల్లా ఇంకొల్లు నుంచి 'గెరిల్లా' అనే పక్షపత్రికనూ నడిపారు.

ప్రజా ఉద్యమాల్లో మమేకమైన విశ్వమోహనరెడ్డి సమసమాజం కోసం కృషి చేశారు. ఉమ్మడి గుంటూరుజిల్లా పిడుగురాళ్లలో నివసించారు. అక్కడ భూమిలేని పేదలకోసం 70 ఎకరాల్లో 700 మంది పేదలకు ఇళ్లు నిర్మించటం విశ్వమోహనరెడ్డి ఉద్యమజీవితంలో గొప్ప మలుపు. లెనిన్‌నగర్‌గా నామకరణం చేశారు. అలాగే కొండమోడు అటవీ ప్రాంతంలో ఖనిజం తవ్విన 60 ఎకరాలను ఆక్రమించి 300 ఇళ్లను శ్రామికుల కోసం నిర్మించి, తరిమెల నాగిరెడ్డినగర్‌గా పేరుపెట్టారు. తన ఉద్యమాలతో పాలకులకు కంటగింపుగా తయారయ్యాడు. ఈ నేపథ్యంలో 2000 ఏప్రిల్ 11న భూమనపల్లె ఎన్‌కౌంటరులో విశ్వమోహనరెడ్డి, రైతుకూలీ ఉద్యమనాయకురాలు పగిడిపల్లి మరియమ్మ మృతి చెందారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా విదేశాల్లోని తెలుగువారి నుండి తీవ్ర నిరసన ఎదురైంది. సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర గవర్నర్‌కు అందజేయటం నిజంగా సాహితీలోకంలో చరిత్ర.



అక్కడ నిర్మించిన స్మారక స్థూపం

డిటెక్టివ్ పుస్తకాలతో సృజన

మరోవైపు నాలుగు డబ్బులు వస్తాయనే భావనతో జనంలో క్రేజ్ ఉన్న డిటెక్టివ్ పుస్తకాలతో ఆయనలోని సృజనకారుడు వెలుగుచూశాడు. హీరోయిజమ్‌ను ఎలివేట్ ఏస్తూ సస్పెన్స్‌తో కూడిన ఆయన క్రైమ్ నవలల కోసం పాఠకులు ఆసక్తిగా ఎదురుచూశారు. కొమ్మిరెడ్డి పేరుతో రాసిన ఆ పుస్తకాల రచనను తర్వాతికాలంలో వదిలేశాడు. ప్రజలకు మేలుచేయలేని రచనలతో ప్రయోజనం లేదని భావించిన విశ్వమోహనరెడ్డి తాను చూసిన జీవితాలు, అధ్యయనం చేసిన సమాజాన్ని అక్షరబద్ధం చేయటం ఆరంభించాడు. ఎవరి స్వార్థం వారిదే, నరబలి, మాయాలోకం, దాడి, దొంగలు, జైలు, బొంగరం, క్షణికం, ప్రేమ, అశ్రుతర్పణం మానవహోమం, పల్లె, బలి, రిగ్గింగ వంటి 20 నవలల్ని రాశాడు. ఒక్కో రచనా ఒక్కో ప్రత్యేకం. ఆనాటి పల్లెలు, మనుషుల్లోని వివిధ రూపాలు, కఠోర జీవనసత్యాలను నిస్సంకోచంగా వెల్లడించాయి. చతుర మాసపత్రిక కొమ్మిరెడ్డి రాసిన 12 నవలల్ని ప్రచురించింది. కేవలం 48 గంటల్లో నవల రాయగలిగిన అలాంటి ప్రతిభావంతుడిని మరొకరని చూడలేదని ప్రముఖ సాహితీవేత్త చలసాని ప్రసాదరావు కీర్తించాడు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం యూకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు మాట్లాడుతూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసే దశలో విలువలు, క్రమశిక్షణ నేర్పడం ఎంతో ముఖ్యమన్నారు. కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, బొల్లేపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతీదేవి, కో ఆర్డినేటర్లు డి.దుర్గా శ్యామ్, పి.శ్రీదేవి పాల్గొన్నారు.

ముగిసిన కోదండ రాముని ఉత్సవాలు



నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్ శ్రీకోదండ రామాలయంలో నిర్వహిస్తున్న సీతారామ కల్యాణ మహోత్సవాలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పూజలు జరిపారు. అన్నదానం ప్రారంభించారు. సాయంత్రం స్వామి వారి పవళింపు సేవ జరిగింది. ఆలయ అధ్యక్షులు కొమ్మినేని శివకోటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షులు కె.ఆదినారాయణ, కోశాధికారి కె.ప్రసాద్, సభ్యులు కె.కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయాణ సమయంలో జాగ్రత్త



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్ : క్షణికానందం కోసం నిర్లక్ష్యంగా, అతివేగంగా ప్రయాణించడం వల్ల ప్రతి ఏడాది వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారులపై వాహన ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 19 బ్లాక్ స్పాట్స్ గుర్తించామని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ కోసం కాజ, పెదకాకాని వద్ద భూ సమీకరణ వెంటనే చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల నుంచి చెత్త సేకరించి జాతీయ రహదారులపై వెళ్లే వాహనాల నుంచి వ్యర్థాలు రోడ్లపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు కావాల్సిన బోర్డులను జీఎంసీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, డీఆర్వో ఖాజావలి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలకు వితరణ

లక్ష్మీపురం: మున్సిపల్ పాఠశాలకు కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి వివిధ సామగ్రి వితరణ చేశారు. గుజ్జనగుండ్లలోని మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల భవనానికి పెయింటింగ్ ఖర్చును అందించారు. ఐరన్ బీరువా, స్టాఫ్ టేబుల్స్, ఇరవై కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సౌకర్యాలను కల్పించటంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. విద్యతో పాటు మౌలిక సౌకర్యాలలో కూడా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు తీర్చిదిద్దటానికి సాయం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ నిధుల ద్వారా కస్టమ్స్, జీఎస్టీ కమిషనరేట్లు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అండగా నిలుస్తాయన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయన్ను పాఠశాల సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి. నరసింహారావు, ఎం.భాస్కరరావు, కె.సుధారాణి, జీఎస్టీ అధికారులు చీదేళ్ళ ఈశ్వరరావు, వరకుమార్, సాదిక్ అలీ, పూర్ణ సాయి, కాకర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ నరసింహారెడ్డి

వ్యాపారవేత్తగా మారేందుకు తొలినాళ్లలోనే బీజం

గుంటూరు ఎడ్యుకేషన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మేనేజ్‌మెంట్ విద్యార్థులు చదువుకునే సమయంలోనే బీజం వేసుకోవాలని ధరణి ఇన్ఫోటెక్ అధినేత విజయ బాపిరెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'సృజన – మీలో ఎవరు ఎంటర్‌ప్రెన్యూర్' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా విజయ బాపిరెడ్డి మాట్లాడుతూ.. వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లినప్పుడే, వాటిని ఆచరణలోకి తీసుకురాగలమని అన్నారు. ప్రస్తుతం దేశంలో అగ్రశ్రేణి కంపెనీలుగా పేరు పొందిన సంస్థలు ఒకనాడు చిన్న ఆలోచనలతో ప్రారంభమైనవేనని వివరించారు. సృజన పోటీల్లో భాగంగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా విద్యార్థులు తమ కలను నిజం చేసుకునేందుకు చక్కటి వేదిక అయిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ... విద్యార్థులు స్టార్టప్, వెంచర్‌లను ప్రారంభించడంలో అవసరమైన వ్యవస్థాపక లక్షణాలను అభివృద్ధి చేసుకోవడానికి ఈ పోటీలను నిర్వహించామని తెలిపారు. విజేతలుగా నిలిచిన పరిపూర్ణ, హరితం, యార్న్ డిలైట్ బృందాలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ వి.చక్రవర్తి, బి.రాజ్యలక్ష్మి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు ఎ. బాజీబాబు, సీహెచ్ వేదవతి, బి. అనిత, రాజరాజేశ్వరిదేవి, శశికళ, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో విజయ బాపిరెడ్డి, ఎస్వీ రమణ తదితరులు

పాత ప్లాన్ ప్రకారం ఫ్లైఓవర్ నిర్మించాలి

- బెటర్ శంకర్ విలాస్ సాధన జేఏసీ డిమాండ్
- లాడ్జి సెంటర్ నుంచి హిందూ కాలేజీ వరకు మానవహారం

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో గతంలో ప్రకటించిన విధంగా లాడ్జి సెంటర్ నుంచి హిందూ కాలేజీ వరకు శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మించాలని, ఆర్‌యూబీ కూడా ముందే నిర్మించాలని 'బెటర్ శంకర్ విలాస్ బ్రిడ్జి సాధన జేఏసీ' పిలుపు మేరకు గురువారం భారీ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.98 కోట్ల పరిమితి విధించి ఎంత దూరం వస్తే అంత నిర్మించాలని చెప్పటం సరికాదన్నారు. గతంలో ఎంపీ గల్లా జయదేవ్ హయాంలో హిందూ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ వరకు నిర్మిస్తామని రూ.167 కోట్లు బడ్జెట్ అంచనా వేశారని గుర్తు చేశారు. ఇప్పుడు దానికి తగ్గించి నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు ఎలా తీరతాయని ప్రశ్నించారు. రెండు, మూడేళ్లపాటు సాగే బ్రిడ్జి నిర్మాణ సమయంలో ట్రాఫిక్ సమస్యలు తీరాలంటే ముందుగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఆర్‌యూబీ లేకపోతే ప్రజలు నరకం చూస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు ఎల్.ఎస్. భారవి మాట్లాడుతూ గతంలో టీడీపీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎంపీ గల్లా జయదేవ్ హయాంలో ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ నిర్మిస్తామని చెప్పారన్నారు. ఇప్పుడు సాధ్యం కాదని అధికారులు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది అభివృద్ధి వ్యతిరేక పోరాటం కాదని, అందరికీ అభివృద్ధి ఉపయోగపడాలని చేస్తున్న పోరాటం అని అన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, జేఏసీ నాయకులు పి.వి. మల్లికార్జునరావులు మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని బ్రిడ్జి నిర్మించాలని కోరారు. కేంద్రం ఇచ్చే నిధులకు అదనంగా సమకూర్చి రాజధాని ప్రాంతంలో కీలకమైన ఈ బ్రిడ్జిని చరిత్రలో గుర్తుండిపోయేలా నిర్మించాలన్నారు. ప్రస్తుత డిజైన్‌లో 25 అడుగుల్లోనే సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారని, అందులో డ్రైన్ల కోసం 5 అడుగుల మేర పోతుందని గుర్తుచేశారు. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరవన్నారు. అనంతరం బ్రాడీపేట వర్తక సంఘం నాయకులు బెల్లంకొండ శ్రీనివాస్, జేఏసీ నాయకులు కె.నళినీకాంత్, పి.హరీష్, అవధానుల హరి, అవగాహన కార్యదర్శి కె.శివరామిరెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు రాధాకృష్ణ, సీనియర్ సిటిజన్స్ నాయకులు సదాశివరావు, జన విజ్ఞాన వేదిక నాయకులు జి. వెంకట్రావు, నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు షేక్ మస్తాన్ వలి, మెడికల్ రిప్రెజెంటేటివ్ నాయకులు షేక్ అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.



మానవహారంలో బెటర్ శంకర్ విలాస్ సాధన జేఏసీ సభ్యులు



ఏసీ కళాశాల ముందు మావనహారంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆర్‌యూబీ వెంటనే నిర్మించాలి: ఎస్ఎఫ్ఐ

శంకర్ విలాస్ పైవంతెన నిర్మాణానికి ముందుగానే ఆర్‌యూబీని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన మానవహారంలో ఆయన మాట్లాడుతూ... 90 శాతం ట్రాఫిక్ అవసరాలు తీర్చే శంకర్ విలాస్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేస్తే పరిస్థితి ఎంత అయోమయంగా ఉంటుందో అధికారులు ఆలోచించాలన్నారు. దీనికి కచ్చితమైన పరిష్కారం ముందుగా ఆర్‌యూబీ నిర్మించటమేనన్నారు. విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించడం, ప్రజల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఆర్‌యూబీని తప్పనిసరిగా నిర్మించాలన్నారు. డొంకరోడ్డు మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ ద్వారా ట్రాఫిక్ మళ్లించడం అసాధ్యమని వివరించారు. అత్యవసర సర్వీసులైన గవర్నమెంట్ ఆస్పత్రి, ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు ఆర్‌యూబీ ద్వారా సులువుగా, సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి యశ్వంత్, పవన్ జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్, భరత్ చంద్ర, సిటీ గర్ల్స్ కన్వీనర్ సౌమ్య, నగర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, కమిటీ సభ్యులు భాను పాల్గొన్నారు.

వేసవికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే సమ్మర్ ప్రత్యేక రైళ్లను గుంటూరు రైల్వే డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్ కుమార్ గురువారం రాత్రి వెల్లడించారు. రైలు నంబర్ 07025 చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్ రైలు ప్రతి శుక్రవారం ప్రత్యేక రైలును ఈ నెల 11 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడపనున్నట్లు తెలిపారు. నంబర్ 07026 శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి రైలు ప్రతి శనివారం ఈ నెల 12 నుంచి జూన్ 28వ తేదీ వరకు నడపనున్నారు. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబర్ 07121 తిరుపతి–మచిలీపట్నం రైలు ప్రతి ఆదివారం, ఈ నెల 13 నుంచి మే 25వ తేదీ వరకు, రైలు నంబర్ 07122 మచిలీపట్నం–తిరుపతి రైలు ప్రతి సోమవారం ఈ నెల 14 నుంచి మే 26వ తేదీ వరకు కేటాయించినట్లు తెలిపారు. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, పెడన స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



లక్ష్మీపురం: ఓ వృద్ధుడు ఎండ తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందిన ఘటన కొరిటిపాడులో గురువారం చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటిపాడు, రావిచెట్టు వద్ద వృద్ధుడు మృతి చెందాడన్న సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలకు ఎస్సై తరంగిణి 8688831614, 0863-2231866 నంబర్లకు సమాచారం తెలియజేయాల్సిందిగా తెలిపారు.



పొన్న వాహనంపై శ్రీస్వామి వారి గ్రామోత్సవం

పొన్న వాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామి

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం స్వామి వారికి పొన్న వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం జయభార్గవి మహిళా సంస్కృతిక భక్త సమాజం ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ ఎస్.ఆంజనేయాచార్యులు పర్యవేక్షించారు.



హాజరైన భక్తులు